# తెరచి రాజు

## వేదాంతం శ్రీపతిశర్మ

రిటైరయిన సుబ్బారావు రెండు సంచుల నిండా కొత్త చీరెలు పెట్టుకొని ఆఫీసులోని కారిడార్‌లోంచి గబగబా వెళ్లిపోతూ కనిపించాడు. కంప్యూటర్ ప్రింట్ తీస్తున్న అనంత్ 'పాపం' అన్నాడు. 'ఏమైంది?' అడిగాను.

'ఇతని వ్యవహారం ఏమోగానీ కొడుకులు పెద్దగా పట్టించుకోరనుకుంటాను. లేకపోతే చీరెలెందుకు అమ్మాలి?'

టేబిల్ మీద టీ కప్ పెట్టి ప్యూన్ ఓసారి అటు తిరిగాడు.

'ఏమో సార్, ఉద్యోగంలో ఉన్నప్పుడు అందరినీ ఆ మాటా ఈ మాటా అనేటోడు. అందరితో అట్టనే ఉంటే నడుస్తుందా?'

మాలతి ఫైల్లోంచి ఒక్కసారి తలెత్తింది. 'ఏదో నయంకాని జబ్బు కూడా వచ్చిందట!'

విని బాధపడ్డాను.

***

సుబ్బారావు దుర్మార్గుడు కాడు. అతని మాటలు చిత్రంగా ఉండేవి. అందరూ మాట్లాడిన తరువాత ఓ నిజం చెప్పి తెర తీసేవాడు. దగ్గరగా ఎవరైనా బిగ్గరగా ఫోనులో మాట్లాడుతుంటే ఆ ఫోన్ చేతిలోకి లాక్కునేవాడు. 'హలో...', అందులో చెప్పేవాడు, '... మీరెవరో నాకు తెలీదు. నాకు మీ ఇద్దరి గొంతులూ వినిపిస్తున్నాయి. మీరు కూర కలుపుకున్నారో పచ్చడి కలుపుకున్నారో మాకెందుకు? ఇలా డిస్టర్బ్ చేసినప్పుడల్లా అందరూ మనసులో తిట్టుకుంటారు. నేను ఇలా తిడతాను. ఉంటాను, భోజనం చెయ్యండి'.

నూటికి పది మందైనా నాలాంటి వాళ్లుంటే చాలా సమస్యలు తీరిపోతాయనేవాడు.

ఆఫీసర్‌గారు రూములోంచి ఇవతలకి వచ్చి మాతో కూర్చున్నప్పుడు ఆయన్నీ వదిలేవాడు కాడు. 'ఎవరూ ఎక్కడికీ పోలేదు సార్. అందరూ పని చేసుకుంటున్నారు'.

'అది కాదయ్యా...', అని ఆయన ఏదో అనబోయేవాడు. ఇతను ఆపేవాడు.

'వద్దండీ. మా మధ్య కూర్చున్నంత మాత్రాన మిమ్మల్ని అహా... ఎంత మంచివాడో అని ఎవరూ అనరు!' ఆయన మొహం చిన్న చేసుకుని వెళ్లిపోయేవాడు...

సుబ్బారావు ఆ మధ్యనే రిటైరయ్యాడు. 'నేను మామూలు మనిషిని...' పార్టీలో చెప్పాడు, '... నిజాన్ని ప్రేమించాను. మీ అందరి మధ్య నుంచీ వెళ్లిపోతున్నందుకు నాకు సంతోషంగా ఉంది. ముప్పయి ఏండ్లుగా మిమ్మల్ని చూస్తూ విసిగిపోయాను. ఎవరినైనా నేను బాధించినట్లు మీరు భావిస్తే నన్ను క్షమించమని కోరను. అమలగారిని ఆ మధ్య మంచి చీరె కట్టుకుని రమ్మన్నాను. నాతో మాట్లాడటం మానేసింది. కానీ ఆపై వారం నుంచీ మంచి చీరెలు కట్టుకుని వచ్చింది!

***

సుబ్బారావు పోయినప్పుడు చూడటానికి వెళ్లిన కొద్దిమందిలో నేనూ ఉన్నాను. అతను చల్లని గాలికి వాకిట్లోకి వచ్చి పడుకున్నట్లుంది. 'మంచివాడు అనిపించుకోవాలనే ప్రతివాడూ మగ్గిపోతాడు...', అతను అనేవాడు, '... జీవితాన్ని మగ్గంలో పెట్టి నిజాలని నక్షత్రాలలా అల్లిచూడు, ఎక్కడున్నా నీ వంట్లో, నీ ఇంట్లో నువ్వే ఉంటావు!'

దూరంగా ఒకే రకం చీరెలు కట్టుకున్న మహిళలు కొందరు నిలబడి ఉన్నారు. వాళ్లవైపు నడచి ఎందుకో ఆగిపోయాను. 'ఈ దండలు తీసుకోండి సార్...' వాళ్లు అంటున్నారు, '...ఇవి సార్ మీద ఉంచండి. మమ్మల్ని దగ్గరకి రానీయరు!' ఆశ్చర్యంతో అవి చేతిలోకి తీసుకున్నాను. 'ఎందుకు?' అడిగాను.



సింగిల్ పేజీ కథ

'మేము మాతమ్మలం...' ఒక మహిళ చెప్పింది, '... మీకు తెలియకపోవచ్చు. చిన్నప్పుడు జబ్బు చేస్తే మమ్మల్ని గుడిలో పెట్టి బ్రతికితే ఊరికి సమర్పిస్తారు. మమ్మల్ని ఆ వృత్తి నుంచి తప్పించి కుట్టు పనులు నేర్పించి మా చీరెలను సార్ స్వయంగా అమ్ముకొస్తున్నారు. అటువంటోరు అరుదు సార్!'

బాధ కలిగింది. 'ఇంత మంచి పని చేసిన వ్యక్తికి ఈ జబ్బు ఎలా వచ్చిందో?', అన్నాను.

'ఆయనకు జబ్బేమీ లేదు సార్...' మరో మహిళ చెప్పింది, '... అలా చెబితే త్వరత్వరగా చాలామంది చీరెలు కొంటారని ఆయన ఆలోచన. ఏనాడూ అబద్ధం చెప్పని ఆయన మా కోసం అలా ప్రచారం చేసారు. మామూలు మాటలు మామూలు మనుషులు కూడా వినరని అన్నారు'.

సుబ్బారావు కొడుకు దగ్గరగా వచ్చాడు. 'రండి సార్, అయిపోవచ్చింది. కొత్త బట్టలకోసం ఆగాము'.

'అవెందుకు?'

'ఆయన కోరికది!'

కళ్లు చెమర్చాయి. 'నటరాజు బొమ్మ చూడు...', సుబ్బారావు మాటలు గుర్తుకొచ్చాయి, '... ఒక కాలితో నిన్నని తొక్కేసి ఒక చేత్తో రేపుని ఆపేసి నేడు అనే నిజంతో ఆనంద తాండవం చేస్తున్నాడు'.

కొత్త బట్టలు తొడిగారు. దండలు ఉంచాను. పుట్టిన రోజులా ఉంది. నిజమే. ఒకరు కోరితే ఈ లోకంలోకి రాము. మరొకరు కోరితే వెళ్లిపోము. దీనిని నిజమని నమ్మి వాటేసుకున్న రోజున తప్ప పరస్పరం ఇచ్చిపుచ్చుకోలేము...